స్పీడ్ బ్రేకర్ల జాడేది?

- ప్రమాదాల బారిన పాదచారులు
- భయపడుతున్న విద్యార్థులు



కంచరపాలెం కూడలి నేతాజీ ఫ్లైఓవర్ నుంచి జ్ఞానాపురం వెళ్లే రహదారి ఇలా..

కంచరపాలెం : కంచరపాలెం నేతాజీ వంతెన కూడలి నుంచి అటు ఊర్వశికూడలి ఇటు జ్ఞానాపురం, తాటిచెట్లపాలెం వైపు వచ్చే రహదారిలో స్పీడ్ బ్రేకర్లు లేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నేతాజీ విగ్రహం నుంచి ముత్యమాంబ ఆలయం వద్ద మలుపులో సుమారు 200 అడుగుల పైగా బీఆర్‌టీఎస్ విస్తరణ జరిగింది. దీంతో ఇక్కడి కూడలి రహదారి వెంబడి గంటకు పదివేలకు పైగా వివిధ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రోడ్డు విశాలం కావడం కూడలిలో బీఆర్‌టీఎస్ కారిడార్లు లేకపోవడం, ఇదే కూడలిలో నిత్యం కంచరపాలెం ట్రాఫిక్ సిబ్బంది వాహనాల తనిఖీలు నిర్వహించడంతో విపరీతమైన రద్దీ ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహన వేగానికి అంతులేకుండా ఇష్టానుసారంగా నడుపుతూ పాదచారులపై దూసుకువస్తున్నారు. కూడలికి సమీపంలో జీవీఎంసీ రామ్మూర్తి పంతులుపేట, కంచరపాలెం, కె.కాలనీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. మితిమీరిన వేగంతో వాహనాలు రావడం వల్ల విద్యార్థులు రోడ్డు దాటేందుకు ఇబ్బంది పడుతున్నారు.

నిత్యం ఇక్కడ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. స్థానికులు కూడా రోడ్డు దాటాలంటేనే హడలిపోతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ కూడళ్లు, పాదచారులు అధికంగా సంచరించే ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా క్రాసింగ్‌లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు దాటాలంటేనే భయం



పాఠశాల నుంచి ఇంటికి వెళ్లేటప్పుడు, వచ్చే సమయంలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. ద్విచక్ర వాహనాలతో పాటు భారీ వాహనాలు వేగంగా వస్తున్నాయి. రోడ్డు దాటాలంటేనే భయమేస్తోంది. స్పీడ్ బ్రేకర్లు వేస్తే ప్రమాదాలు నివారించవచ్చును.

– ఎస్.కె.నిషా, విద్యార్థిని, ఆర్పీపేట పాఠశాల

అధికారులు స్పందించాలి



కంచరపాలెం కూడలి 'వై' జంక్షన్‌గా ఉండడంతో అడ్డదిడ్డంగా వాహనదారులు వస్తుంటారు. కూడలి నుంచి సమీప పాఠశాలలకు వెళ్లే రహదారిలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పిల్లలను పాఠశాలలకు పంపాలంటేనే తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సి వస్తుంది. అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు చేయాలి.

– దాసరి శామ్యూల్, దయానందనగర్, కంచరపాలెం

పేదల పక్షపాతి సీఎం జగన్



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఆడారి

కంచరపాలెం: ప్రతీ గడపలో సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి రూపకల్పన చేశారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 56వ వార్డు గొల్లకంచరపాలెం, తోటవీధి సచివాలయాల పరిధిలో పార్టీ వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన సాగిస్తున్నారన్నారు. ఆయన పేదల పక్షపాతి అన్నారు. ప్రజా సంకల్ప యాత్రలో ప్రజల ఆర్థిక ఇబ్బందులను తెలుసుకున్న ఆయన, దానికి అనుగుణంగా నేడు విద్య, వైద్యం, ఉపాధి ప్రతి పేదవాడికి అందే విధంగా పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. అటువంటి ముఖ్యమంత్రికి మనం అంతా అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ క్లస్టర్ కన్వీనర్ పల్లా ఎర్నికుమార్ యాదవ్, సర్వసిద్ధి సాయిలత, మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ కె.నర్సింగరావు, నాయకులు దాసరి శామ్యూల్, నమ్మి శ్రీను, మజ్జి నూకరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

ఓల్డేజ్ హోమ్‌కు మరిడిమాంబ చీరలు

- రెండు వేల చీరలు అందజేత



వృద్ధాశ్రమానికి తరలించిన చీరలు మూటలు



మందిరం ఆవరణలో చీరలు లెక్కిస్తున్న దృశ్యం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మరిడిమాంబ ఆలయానికి భక్తులు కానుకగా సమర్పించిన చీరలను ఆలయ నిర్వాహకులు నగరంలోని పలు వృద్ధాశ్రమాలకు తరలించి,అక్కడ వృద్ధులకు అందజేశారు. సామాజిక సేవా కార్యకర్త చెల్లూరి భాస్కరరావు ఆధ్వర్యంలో మరిడిమాంబ ఆలయ నిర్వాహకులు మోదు అచ్యుతరావు,మోదు ఎల్లాజీరావు,కదిరి దుర్గారావు,నాగల సతీష్ తదితరులు ఏడాది పాటు అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను ఒక చోట ఉంచారు. గతంలో ఈ చీరలను భక్తులకు అందజేసేవారు. కానీ ఇప్పుడు వారు కొత్త ఆలోచన చేశారు. వృద్ధాశ్రమాలకు అందజేసి ఉదారత చాటుకున్నారు. సుమారు 2 వేల చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మల్కాపురం జాలర కుల సంఘం ప్రతినిధులు,సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా గిరిదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాలు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లో వెలసిన గిరి దుర్గాదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు గిరిదుర్గాదేవిని దర్శించుకుని పసుపు, కుంకుమ, చీర, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, జిల్లా వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షులు కలిదిండి బద్రీనాథ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

బీజేపీ పశ్చిమ కన్వీనర్‌గా దాడి



పురుషోత్తమ రమేష్

గోపాలపట్నం: బీజేపీ పశ్చిమ నియోజకవర్గం కన్వీనర్‌గా దాడి పుషోత్తమ రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారని ఆయన పేర్కొన్నారు. తనపై విశ్వాసంతో నియోజకవర్గం బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

క్రమశిక్షణతోనే ఉన్నత స్థితి



మొమెంటోలు అందుకున్న విద్యార్థులతో జాకబ్ రాజు, రామకృష్ణారెడ్డి

గోపాలపట్నం: క్రమశిక్షణతోనే విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఐటీఐ విశ్రాంత ప్రిన్సిపాల్ జాకబ్ రాజు అన్నారు. ఎస్‌ఏడీ రామకృష్ణ పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు పలు అంశాల్లో నైపుణ్యాలు సాధించాలన్నారు. పాఠశాల చైర్మన్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నేటి యువత చెడు వ్యసనాలకు లోనుకావడం చాలా బాధాకరమన్నారు. పదోతరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవీంద్రుడు, హెచ్‌ఎంలు కె. లక్ష్మి,నళిని, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'రామాయణ సంగ్రహము' గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న నాగార్జున యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య బాలమోహన్‌దాస్

సీతంపేట: రచయిత ఆదూరి భీమారావు రచించిన రామాయణ సంగ్రహము గ్రంథావిష్కరణ సభ స్థానిక పౌరగ్రంథాలయంలో జరిగింది. ప్రసన్నభారతి సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాగార్జున యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ ముఖ్య అతిథిగా గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమారావు 90 ఏళ్ల వయస్సులో గ్రంథాన్ని రాయడం అభినందనీయమన్నారు. సభాధ్యక్షుడు వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి మాట్లాడుతూ వాల్మీకి రామాయణం ఈ సృష్టి ఉన్నంత కాలం చిరస్థాయిగా నిలిచి ఉంటుందన్నారు. శాశ్వత విలువలు రామాయణంలో ఉన్నాయని, వేదమే రామాయణంగా అవతరించిందన్నారు. ప్రముఖ సాహితీవేత్త డి.వి.సూర్యారావు గ్రంథ సమీక్ష చేశారు. కేవలం కథ చెప్పడమే కాకుండా కథ ఘట్టాలను, పాత్రలను విమర్శ దృష్టితో పరిశీలించారని ప్రతి కాండ సారాన్ని చక్కని విశ్లేషణతో అందించారన్నారు. రచయిత భీమేశ్వరరావు మాట్లాడుతూ కొన్ని వ్యాఖ్యానాలు ఆధారంగా గ్రంథ రచన చేశానని తెలిపారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



మహిళకు కంటి పరీక్ష చేస్తున్న వైద్యురాలు

సింధియా: ఆడారి తులసీరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని విశాఖ డెయిరీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ ముఖ్యఅతిథులుగా ప్రారంభించారు. శిబిరంలో సుమారు 190 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. వారికి ఉచితంగా మందులు, 52 మందికి కంటి అద్దాలు అందజేశారు. కంటి ఆపరేషన్ అవసరమైన మరో 67 మందికి త్వరలోనే శస్త్రచికిత్స చేయించేందుకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆల్ఫా కృష్ణ, వరపల మహేష్, బాలు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తాం



హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న బద్రీనాథ్,సురేష్

వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బద్రీనాథ్

మల్కాపురం: కార్మికుల సంక్షేమమే తమ ధ్యేయం అని, వారి సంక్షేమం కోసం ఎలాంటి పోరాటానికైనా సిద్ధమని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ అన్నారు. ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలోని పలు పరిశ్రమల వద్ద మంగళవారం ట్రేడ్ యూనియన్ జెండాను ఆవిష్కరించారు. కోరమాండల్ గేటు ఎదురుగా జరిగిన కార్యక్రమంలో బద్రీనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ,ప్రైవేట్ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తున్నామన్నారు. తమ యూనియన్ ద్వారా కొంతమంది నిరుద్యోగులకు తాత్కాలిక పద్ధతిలో ఉపాధి కల్పించామని చెప్పారు. భవిష్యత్‌లో మరింత మంది యువతకు వివిధ పరిశ్రమల్లో ఉపాధి కల్పనకు కృషి చేస్తామన్నారు. 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ మాట్లాడుతూ ట్రేడ్ యూనియన్ అంటే కార్మిక సమస్యలపై పోరాడడమే కాదని, వారి కష్టసుఖాలలో అండగా నిలిచేవారే ట్రేడ్ యూనియన్ ప్రతినిధులని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్‌ను చూస్తే తెలుస్తుందన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కార్మికులకు తినిపించారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకులు నేవీ అనీల్, బిల్డర్ సంతోష్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

జీవో 21 రద్దు చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఆటో రిక్షా కార్మికులు

అల్లిపురం: కేంద్ర ప్రభుత్వం జీవో నంబర్ 21 తీసుకువచ్చి మోటార్ కార్మికులకు ఉరి తాడు బిగించిందని, తక్షణమే దానిని రద్దు చేయాలని విశాఖపట్నం ఆటో రిక్షా కార్మిక సంఘం (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ రెహమాన్ డిమాండ్ చేశారు. సంఘం జనరల్ బాడీ సమావేశం సోమవారం జరిగింది. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ఆటోలు, ఆటో డ్రైవర్లు రెండు నెలల పాటు ఇంటికే పరిమితమయ్యారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎటువంటి సహాయం అందించక ఎన్నో ఇబ్బందులు పడ్డామన్నారు. పెట్రోలు, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. కేసులను వెంటనే ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. ఆటో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ కాసుబాబు, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎం.మన్మథరావు, సీహెచ్ సాయి అప్పలరాజు, శ్రీను, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక రథసారథి కొసనా



కొసనా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళారంగ ప్రముఖులు

సీతంపేట: ఆరున్నర దశాబ్దాలు కళారంగానికి సేవలందించిన కొసనా తృతీయ వర్ధంతి సభ స్థానిక పౌరగ్రంథాలయంలో జరిగింది. ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు కళాకారులు పాల్గొని కొసనా చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ మాట్లాడుతూ కళలను, కళాకారులను ప్రోత్సహించిన సాంస్కృతిక నిఘంటువు కొసనా అని కొనియాడారు. కళావేదిక ట్రస్టు అధ్యక్షులు నందూరి రామకృష్ణ మాట్లాడుతూ సంగీతం, సాహిత్యం, నాటకం, చిత్రలేఖనం వంటి అంశాలలో నిరంతరం సేవలందించిన మహోన్నత వ్యక్తి కొసనా అని ప్రశంసించారు. కొసనా తనయుడు బ్రహ్మాజీ మాట్లాడుతూ తన తండ్రి సేవలను గుర్తుపెట్టుకుని క్రమం తప్పకుండా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆధ్యాత్మికవేత్తలు ఎస్.ఫణిస్వామి, ఎం.వి.రాజశేఖర్, కొసనా కల్చరల్ అకాడమి అధ్యక్షురాలు సుసర్ల శేషమణి, స్వరరంజని అధ్యక్షురాలు లతారాములు, కళారంగ ప్రముఖులు మేడా మస్తాన్‌రెడ్డి, నాంచారయ్య, పి.శ్యామ్‌సుందర్, మెలోడి సత్యనారాయణ, ఎంవీఆర్ నాగేశ్వరరావు, ఎంటీఆర్ త్రినాథ్, లోకేష్, బంగార్రాజు, బి.సత్యమాధవి పాల్గొని నివాళులు అర్పించారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులుగా 'గెస్ట్'లకు అవకాశమివ్వాలి

మద్దిలపాలెం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొత్తగా చేపడుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల నియామకాల్లో ఇప్పటికే పదేళ్లుగా పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు అవకాశం కల్పించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు శరత్ ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2014 నుంచి ఇప్పటి వరకూ 1074 మంది గెస్ట్ ఫ్యాకల్టీగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. 2012 నుంచి కాంట్రాక్ట్ ఫ్యాకల్టీ నియామకాలు నిలిపివేశారన్నారు. అప్పటి నుంచి గెస్ట్ ఫ్యాకల్టీతోనే కాలం వెల్లదీశారన్నారు. ప్రస్తుతం 21 కాంట్రాక్ట్ అధ్యాపక పోస్టులు భర్తీ చేయడానికి రీజనల్ జాయింట్ డైరెక్టర్ సన్నాహాలు చేస్తున్నారని, త్రిసభ్య కమిటీ ద్వారా నియామకమైన గెస్ట్ ఫ్యాకల్టీలకు ఆ అవకాశం కల్పించాలని కోరారు. లేని పక్షంలో ఆ నియామకాలను సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు నిలిపివేయాలని శరత్ డిమాండ్ చేశారు.

దోపిడీకి వ్యతిరేకంగా యువత పోరాడాలి

అల్లిపురం: దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన బాధ్యత యువత, విద్యార్థులదేనని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పీడీఎస్‌వో) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.భాస్కర్ అన్నారు. భగత్‌సింగ్ 92వ వర్ధంతి సందర్భంగా 'విద్యార్థులు ఆత్మహత్యలు–వ్యవస్థాపక కారణాలు–మన కర్తవ్యాలు'అనే అంశంపై వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సభలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్ ఒక మనిషిని వేరొక మనిషి, ఒక జాతిని వేరొక జాతి, ఒక దేశాన్ని వేరొక దేశం దోచుకోని సమ సమాజం రావాలని కోరుకున్నారన్నారు. కాని నేటికీ మనదేశంలో విదేశీ బహుళ జాతి కంపెనీల దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతుందన్నారు. రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను మాట్లాడుతూ దేశంలో వరుసగా జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యల గురించి ప్రస్తావించి నేటి చదువు విద్యార్థులకు వారి సమస్యలు పరిష్కరించుకుని ఆత్మస్థైర్యాన్ని ఎందుకు ఇవ్వలేకపోతోందన్నారు. ప్రస్తుత విద్యా విధానాన్ని ఎండగట్టారు. ఈ ఆత్మహత్యలన్నీ వ్యవస్థ చేస్తున్న హత్యలేనని, వాటికి గల మూల కారణాలపై భగత్‌సింగ్ వంటి పోరాట యోధుల స్ఫూర్తితో పోరాడాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌వో జిల్లా అధ్యక్షుడు పి.విశ్వనాథ్, విశాఖ జిల్లా కమిటీ సభ్యురాలు ఎం. లలిత, జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి పాల్గొన్నారు.

టెక్‌ఫెస్ట్‌లో గైస్ విద్యార్థుల ప్రతిభ



కాలేజీ అధ్యాపకులతో టెక్‌ఫెస్ట్‌లో ప్రతిభా ధ్రువపత్రాలు అందుకున్న గైస్ విద్యార్థులు

మురళీనగర్: కాకినాడ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీలో ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి టెక్ ఫెస్ట్‌లో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్) విద్యార్థులు ప్రతిభను చాటారు. వీరు 8 గ్రూపులుగా తమ సృజనాత్మక పరిశోధనలకు సంబంధించిన ప్రాజెక్టులను ఇందులో ప్రదర్శించారు. రెండు గ్రూపులు పోస్టర్ ప్రదర్శన విభాగం, ఆరు గ్రూపులు పేపర్ ప్రజంటేషన్ (పరిశోధనా పత్రం) విభాగాల్లో పాల్గొన్నారు. వీరిలో 5 గ్రూపులు బహుమతులు గెలుచుకున్నాయి. బి.ప్రణీత, సీహెచ్ మేఘన, జి.మెర్సీ, ఎల్ మురళీకృష్ణారావుల బృందం ఆయిల్ అండ్ గ్యాస్ ఇండస్ట్రీకి సంబంధించి పోస్టర్ ప్రదర్శనలో మొదటి బహుమతి, గ్రీన్ కెమికల్స్ విభాగంలో బి.ప్రియాంక, అంజలి కుమారి, పి.జాహ్నవి బృందం పేపర్ ప్రజెంటేషన్‌లో మొదటి స్థానం, ఇదే విభాగంలో బి.హరి శంకర్, బి.నిత్యప్రకాష్, ఎంవీ నరేష్ వర్మ బృందం ద్వితీయ బహుమతి, కార్బన్ సీక్వెస్ట్రేషన్ విభాగంలో వై.హర్ష, పి.లక్ష్మణ్‌చరణ్, కె.దుర్గా ప్రసాద్‌ల బృందం పేపర్ ప్రజెంటేషన్‌కు ద్వితీయ బహుమతి, సబ్–సీ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగంలో జయంతి శ్రావణ శృతి, ఎల్.తేజసాయి, వి.జ్ఞానేశ్వర్ బృందం పేపర్ ప్రజెంటేషన్‌కు ద్వితీయ బహుమతి లభించింది. ఈ సందర్భంగా కాలేజీలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, ఇతర సిబ్బంది అభినందించారు.

ఆలయ సంపూర్ణ నిర్మాణానికి సహకారం



శ్రీరాముడి సన్నిధిలో మళ్ల విజయప్రసాద్

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గొల్లకంచరపాలెం శ్రీరామ సేవా సమాజం(యాదవ) ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయ సముదాయాన్ని రాష్ట్ర విద్య, సంక్షేమ, మౌలిక సదుపాయాలు, అభివృద్ధి సంస్థ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ సందర్శించారు. ఆలయంలో ప్రతిష్ఠించిన ధనలక్ష్మి, సంపత్ వేంకటేశ్వర స్వామి, సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆయనకు గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ సంపూర్ణ నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తానని మళ్ల విజయప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్, వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆడారి శ్రీను, సచివాలయ క్లస్టర్ ఇన్‌చార్జి పల్లా ఎర్నికుమార్, బాకీ శ్యామ్‌కుమార్‌రెడ్డి, సాయిలత, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన



షిప్‌యార్డ్‌కాలనీలోని పాతరామాలయాన్ని సందర్శిస్తున్న యూనియన్ నాయకులు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డ్‌కాలనీలోని పాతరామాలయాన్ని మంగళవారం షిప్‌యార్డ్ యూనియన్ నాయకులు సందర్శించారు. శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. షిప్‌యార్డ్ యాజమాన్యంతో మాట్లాడి సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ షిప్‌యార్డ్ విస్తరణ పనులు జరుగుతున్న తరుణంలో వెయ్యి మంది కార్మిక కుటుంబాలు కాలనీలో నివాసముండేవారని, 1952లో శ్రీరామబాల భజన మందిరం పేరుతో కార్మిక కుటుంబాల పిల్లలు కలిసిమెలసి ఉత్సవాలు నిర్వహించేవారని గుర్తు చేశారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఈ నెల 30వ తేదీ శ్రీ రామ నవమిని పర్వదినాన్ని పురస్కరించుకుని సీతారాముల కల్యాణ మహోత్సవాలను అత్యంత ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. సీతారాములకు పంచామృతాభిషేకాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎవీ రమణమూర్తి, ఇతర యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రాగిజావ పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ



క్వీన్‌మేరీ స్కూల్లో రాగిజావ పంపిణీని పర్యవేక్షిస్తున్న హెచ్‌ఎం ధర్మేంద్రరెడ్డి

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోన్న రాగిజావ పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి 11 గంటల మధ్య (ఇంటర్వెల్ సమయంలో) విద్యార్థులకు రాగిజావ ఇచ్చేలా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. జిల్లాలోని 587 పాఠశాలల్లో అమలు చేస్తుండగా, 87,861 మంది విద్యార్థులు దీని ద్వారా లబ్ధి పొందుతున్నారు. రోజుకో రుచికరమైన వంటకంతో జగనన్న గోరుముద్ద పథకం అందిస్తూనే, విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేకంగా రాగిజావ ఇస్తున్నారు. బెల్లం పొడి కలిపిన రాగిజావ ఎంతో రుచికరంగా ఉండటంతో దీనిని తీసుకునేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో పరిశుభ్రమైన వాతావరణంలో రాగిజావ తయారు చేసేలా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

గ్రూప్–1 పరీక్ష వాయిదాపై హర్షం

ఎంవీపీ కాలనీ: గ్రూప్–1 ప్రధాన పరీక్షను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేయడంపై నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు ప్రభుత్వానికి, వాయిదా దిశగా కృషి చేసిన మంత్రి బొత్స సత్యనారాయణకు ఆయన ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. వాయిదాతో శిక్షణకు అభ్యర్థులకు మరికొంత సమయం లభించిందన్నారు. ఎస్సై, కానిస్టేబుల్ ప్రాథమిక పరీక్షలో ప్రశ్నపత్రంలో లోపాల నేపథ్యంలో సచివాలయ పరీక్షల తరహాలో 15 గ్రేస్ మార్కులు కలపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగ వయోపరిమితి పెంచి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

30న సహస్ర తులసిపూజ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 30న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే దంపతులు పూజా రుసుం రూ.1500 చెల్లించి పాల్గొనవచ్చని ఆమె పేర్కొన్నారు.